సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 7 । జూలై । 2023



రాయితీపై టమాటా విక్రయాలు

రాష్ట్రప్రభుత్వం రైతు బజార్లలో రాయితీధరపై టమాటా విక్రయాలు జరుపుతోందని జేడీ రామాంజనేయులు తెలిపారు. -8లో



మెరుగైన జీవనానికి వైకల్యం అడ్డంకి కాదు

శారీరక వైకల్యం మెరుగైన జీవనానికి అడ్డంకి కాదని, వారికి తోడ్పాటునందిస్తే ఏదైనా సాధిస్తారని జేసీ అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.950	రూ.1160
రెండోరకం	రూ.840	రూ.950



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 898 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	265	469
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 216.38 కిలోలు

న్యూస్‌రీల్

సంక్రమిత వ్యాధులపై అవగాహన తప్పనిసరి

రాయచోటి అర్బన్: పశుపక్ష్యాదులతో మానవులకు సంక్రమించే వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై, ఉపసంచాలకుడు శ్రీనివాసులు నాయుడులు అన్నారు. నేషనల్ లైవ్‌స్టార్ మిషన్ వారి సహకారంతో గురువారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో జూనోసిస్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఎస్.వి.శివారెడ్డి, సహాయ సంచాలకులు పశువైద్యశాలలో 100 కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు ఉచితంగా వేశారు.

ఏపీఎండీసీ గనుల పరిశీలన



మంగంపేటలో పేలుడు పదార్థాల నిల్వను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గంగాధర్ రావు

ఓబులవారిపల్లె: ఏపీఎండీసీ గనులను జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు గురువారం పరిశీలించారు. మంగంపేట బెరైటీస్ నిక్షేపాలు ఉన్న గనులను వ్యూ పాయింట్ ద్వారా పరిశీలించారు. బెరైటీస్ ఖనిజం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పేలుడు పదార్థాలు నిల్వ ఉన్న ప్రాంతాన్ని తనిఖీ చేశారు. గనుల్లో బ్లాస్టింగ్ గురించి సీపీఓ సుదర్శన్‌రెడ్డి ఎస్పీకి వివరించారు.

12 మంది డిబార్

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో గురువారం 12 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురిని పరీక్షల నియంత్రణ అధికారి అచార్య ఎన్. ఈశ్వరరెడ్డి డిబార్ చేశారు. స్క్వాడ్ సభ్యులు ఆచార్య రాఘవప్రసాద్, గంగిరెడ్డి, ఎంవీ శంకర్, చంద్ర ఓబుల్‌రెడ్డిలు వీరబల్లి, రాయచోటి, సుండుపల్లె కేంద్రాలను తనిఖీ చేసి ఏడుగురు విద్యార్థులను డిబార్ చేశారు. పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

విహార, తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సులు


రాయచోటి అర్బన్: రాయచోటి డిపో నుంచి విహార, తీర్థయాత్రల కోసం ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు డీఎం ధనుజంయ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి నుంచి అరుణాచలానికి రూ.875 టికెట్‌తో రెండు రోజుల స్పెషల్‌యాత్ర, రూ. 4500లతో 3 రోజుల షిరిడీయాత్ర, రూ.5,700లతో 5 రోజులు భద్రాచలం, రూ. 2వేల టికెట్‌తో 2 రోజుల శ్రీశైలం యాత్ర, రూ.2,200తో నాగూరు-వేళాంగిణికి 4 రోజుల యాత్ర, రూ.4500తో 5 రోజుల రామేశ్వరం యాత్రకు బస్సులను తిప్పుతామన్నారు. రూ.4700ల టికెట్‌తో 5 రోజుల గోకర్ణయాత్ర, రూ.500తో 1 రోజు గుడిమల్లం యాత్ర, రూ.700తో 1రోజు శ్రీహరికోట, రూ.500తో పుంగనూరు వండర్‌లా , రూ. 3 వేలతో 3రోజుల ఊటీయాత్ర, రూ.3500 టికెట్‌తో 4రోజుల గోవాయాత్రలకు బస్సులను నడపనున్నట్లు చెప్పారు.

వానాకాలం..వ్యాధుల గాలం

పొంచి ఉన్న రోగాల ముప్పు
- మలేరియా, డెంగీ, జలుబుతో ప్రమాదం
- ప్రధాన ఆస్పత్రుల్లో పెరుగుతున్న ఓపీ
- పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ



మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో రోగులతో నిండిన ఓ వార్డు



సాక్షి రాయచోటి : వ్యాధుల సీజన్ ప్రారంభమైంది. ఒకవైపు వివిధ వైరస్‌ల పట్ల జాగ్రత్తలు తీసుకుంటూనే మరోవైపు వ్యాధుల పట్ల అప్రమత్తం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఏడాది నాలుగైదు నెలలపాటు రోగాల సీజన్‌గా గుర్తించి వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమవుతోంది.ప్రస్తుతం రుతు పవనాలజాడ నేపథ్యంలో వర్షాలు కురుస్తున్న తరుణంలో వ్యాధుల ముప్పు కూడా పొంచి ఉంది. వాతావరణం ఎప్పటికప్పుడు మారుతుండడం...తుపాన్లు, వర్షాలు కురుస్తుండడం వల్ల కూడా వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ సీజన్‌లో ప్రధానంగా నాలుగైదు రకాల జ్వరాలతోపాటు జలుబు, అస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల ప్రభావం అధికంగా ఉంటుంది. ఇప్పటికే జలుబు, జ్వరాలు విస్తరిస్తున్నాయి. ఎక్కడికక్కడ ఆస్పత్రుల వైపు రోగులు వెళుతుండడంతో ఓపీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మరోవైపు వైద్య ఆరోగ్యశాఖ కూడా ప్రత్యేక చర్యలకు ఉపక్రమించింది. ప్రజలను అప్రమత్తం చేస్తోంది.మూడు నెలలపాటు ఉక్కపోత, అధిక వేడితో అల్లాడిన జనానికి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావడంతో జ్వరాలతోపాటు జలుబులు మొదలయ్యాయి. ఎక్కడికక్కడ ప్రైవేటు ఆస్పత్రులతోపాటు ప్రభుత్వ వైద్యశాలల వద్ద ఓపీ సంఖ్య పెరుగుతోంది. చిన్న పిల్లలు, వృద్ధులు త్వరగా జ్వరాల బారిన పడే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లె జిల్లా ఆస్పత్రి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లె ఇలా అన్నిచోట్ల ఇప్పుడిప్పుడే పలు వ్యాధులు ప్రబలుతున్నాయి.

జ్వరాలతో ప్రమాదం

ఈ సీజన్ ఆరు నెలలపాటు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలు విస్తరిస్తాయి. డెంగీ సోకిన వ్యక్తికి రక్తకణాల కొరత ఏర్పడడంతో పరిస్థితి విషమించే ప్రమాదం ఉంది. వైరల్ జ్వరాల పట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇంటిలో ఒకరికి వచ్చినా మిగతా వారికి విస్తరించే అవకాశం ఉంటుంది. జిల్లాలోని పట్టణ ప్రాంతాలు, మేజర్ పంచాయతీల్లో ఫాగింగ్‌కు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలి.

పరిశుభ్రతదీ ప్రధాన పాత్ర

పలు వ్యాధులకు పరిసరాల అపరిశుభ్రత కూడా ఓ కారణంగా నిలుస్తోంది. ప్రజలు తాము నివసిస్తున్న ప్రాంతాల్లో మురుగు, వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. నీరు నిల్వ ఉన్నట్లయితే లార్వా ఉత్పత్తి జరిగి దోమల పెరుగుదలకు కారణమవుతాయి. ప్రజలు సాధ్యమైనంత వరకు వేడి పదార్థాలను తీసుకోవాలని, గోరు వెచ్చిన నీరు తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.



రోగులతో కిటకిటలాడుతున్న మదనపల్లె జిల్లా ఆస్పత్రి

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో వ్యాధుల సీజన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఈ విషయంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సిబ్బందికి ఇప్పటికే ఆదేశించాలం. వారు గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించాం. జలుబు, జ్వరం తదితర ఎలాంటి కేసులు వచ్చినా రక్తపరీక్షలు, ఇతర వైద్య సేవలు పొందాలి. జిల్లాలోని పీహెచ్‌సీల్లో మందుల సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ కొండయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

ప్రజలకు అందుబాటులో ఉండాలి



వివిధ వ్యాధులకు సంబంధించి రానున్న ఆరు నెలలపాటు కీలక సమయం. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రజలు పలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి. వైద్యులు ప్రజలకు అత్యవసర సమయంలో వైద్య సేవలు అందించడం ద్వారా ఉన్నతాధికారులు మన్ననలు పొందాలి. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకుని వ్యాధులు ప్రబలకుండా చూడాలి.

– పీఎస్ గిరీషా, కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

జగనన్న సురక్షలో తీరిన 15 ఏళ్ల సమస్య



స్థలం ఇచ్చిన సి. పక్కీర్ సాబ్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు

కురబలకోట: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 15 ఏళ్ల సమస్య జగనన్న సురక్ష కార్యక్రమం సందర్భంగా పరిష్కారమైంది.వివరాలు.. తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండల కేంద్రంలోని ప్రశాంత్ నగర్ వద్ద మూడు వీధుల నుంచి వచ్చే మురికినీరు బయటకు వెళ్లేదారి లేక స్థానికులు, పంచాయతీ సిబ్బంది ఇబ్బందులు పడేవారు. ఈ మురికినీరు అదే ఊరికి చెందిన సి.పక్కీర్ సాబ్‌కు చెందిన భూమి ద్వారా వెళ్లాలి. ఇది పట్టా భూమి కావడంతో మురికినీళ్ల వెళ్లడానికి ఆయన సమ్మతించలేదు. గతంలో వివిధ గ్రామ సభల్లో స్థానికులు అర్జీలు ఇచ్చినా పరిష్కారం కాలేదు. ఇన్నేళ్లు మురికి నీరు వెళ్లే మార్గం లేక కొందరు ఇళ్ల వద్ద గుంతలు కొట్టుకోవడం మరి కొందరు బయట పారపోయడం లాంటి పనులు చేస్తూ వచ్చారు. గురువారం ఆఊరిలో సర్పంచ్ సుక్కా సుజాత ఆధ్వర్యంలో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. మూడు వీధుల బాధితులు సమస్యను మరోసారి విన్నవించారు. జెడ్పీటీసీ బైసాని జ్యోతి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, సర్పంచ్ సుక్కా సుజాత, స్థానిక నాయకులు సుక్కా మనోహర్ సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. రెండు సెంట్లు స్థలం వదిలితే మురికినీళ్లు వెళుతాయి. ఇందుకు ఆపట్టా భూమి ఆసామి సి.పక్కీర్ సాబ్‌తో మాట్లాడారు. ఊరి వారికి సౌకర్యంగా పెద్దమనసు చేసుకుని రెండు సెంట్ల స్థలాన్ని వదలాల్సిందిగా నచ్చచెప్పారు. ఇది రూ.2 లక్షలు విలువ చేస్తుందని చెబుతున్నారు. దీంతో ఇన్నాళ్లు ఈ స్థలం వదలడానికి ససేమిరా అంటూ మొండికేస్తూ వచ్చిన పక్కీర్ సాబ్ నాయకులు, పెద్దల ఒత్తిడి, స్థానికుల ఇబ్బందులు చూసి చివరకు సమ్మతించారు. 15 ఏళ్లుగా నానుతూ వచ్చిన సమస్య జగనన్న సురక్షలో తీరడంతో కాలనీ వాసుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. పెద్ద మనసుతో మురికినీరు వెళ్లడానికి పట్టా భూమిని వదిలిన పక్కీర్ సాబ్‌ను గ్రామస్తులు అభినందించారు. జగనన్న సురక్ష సభలో ఆయన్ను ఘనంగా సత్కరించారు.

వైభవం.. ధ్వజావరోహణం



సౌమ్యనాథస్వామి ఆలయంలో ధ్వజావరోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నందలూరు(రాజంపేట): నందలూరు సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారంతో వైభవంగా ముగిశాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో విలీనం తర్వాత తొలిసారిగా స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహించింది.ముగింపురోజున అర్చకులు సునీల్, సాయి ధ్వజావరోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చక్రస్నానం: ప్రత్యేకస్నానపీఠంపై శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆగమశాస్త్ర పండితులు కోనేరులో చక్రస్నానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ అరిగెలసౌమిత్రి, ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పెనుబాలనాగసుబ్బయ్య, ఎంపీటీసీ సోమిశెట్టి సునీతా ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెలనాని, గుణయాదవ్, కాకిచంద్ర పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు పరిహారం నిధులు విడుదల

కురబలకోట: భుత్వం అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ నిర్వాసితులకు శుభ వార్త చెప్పింది. భూములు కోల్పోతున్న బాధితులకు పరిహారం చెల్లింపునకు రూ. వంద కోట్లు విడుదల చేసినట్లు ఇరిగేషన్ శాఖ మదనపల్లె ఈఈ సురేంద్రరెడ్డి గురువారం తెలిపారు. హెచ్‌ఎన్‌ఎస్ పీలేరు యూనిట్-2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ద్వారా ఈ నిధులు త్వరలో నిర్వాసితుల ఖాతాలకు జమ కానున్నాయన్నారు. ఇందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. రూ. 759 కోట్లతో 2.2 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో గత ఏడాది ముదివేడు రిజర్వాయర్ పనులు ప్రారంభమయ్యాయి. 1075.81 ఎకరాలు సేకరించారు. 20 వేల పాత ఆయకట్టు, మరో 15 వేల కొత్త ఆయకట్టుకు సాగునీళ్లు ఇస్తారు. నిర్వాసితులకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అండగా నిలుస్తున్నారు. రిజర్వాయర్ పనులు ప్రారంభించి ఒకటిన్నర సంవత్సరం కూడా కాకనే పరిహారం నిధులు రావడం పట్ల భూ నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి వైఎస్సార్ జిల్లాలో సీఎం వైఎస్ జగన్ పర్యటన

పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు



కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జిల్లా పర్యటనకు వస్తున్నట్లు అధికారికంగా సమాచారం అందింది. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదివారం గండికోట, పులివెందులలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. సోమవారం కడప నగరంతోపాటు కొప్పర్తి పారిశ్రామికవాడను సందర్శించి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు.

8వ తేదీ పర్యటన ఇలా..
- మధ్యాహ్నం 1.30 గంటలకు కల్యాణదుర్గంలో బయలుదేరి 1.55 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 2.05 గంటలకు వైఎస్సార్ ఘాట్ వద్దకు వెళతారు.
- 2.25 గంటల వరకు అక్కడ జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తారు.
- 2.25 గంటలకు ఘాట్ నుంచి బయలుదేరి ప్రేయర్ హాలుకు 2.30 గంటలకు చేరుకుంటారు.
- 5.30 గంటల వరకు సింహాద్రిపురం మండల ప్రజా ప్రతినిధులతో సమావేశమవుతారు.
- 5.35కు హెచ్‌సీఎం రెసిడెన్స్‌కు చేరుకుంటారు.

9వ తేదీ..
- ఉదయం 8.50 గంటలకు హెచ్‌సీఎం రెసిడెన్సి నుంచి బయలుదేరి 8.55 గంటలకు హెలిప్యాడ్ చేరుకుంటారు.
- 9.20 గంటలకు గండికోట హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 9.30 గంటలకు ఒబెరాయ్ హోటల్ శంకుస్థాపనలో పాల్గొంటారు.
- 10.15 గంటలకు గండికోట వ్యూ పాయింట్‌కు చేరుకుంటారు.
- 10.25 గంటలకు బయలుదేరి 10.30 గంటలకు గండికోట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.50 గంటలకు పులివెందుల భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11.05 గంటలకు పులివెందుల కొత్త మున్సిపల్ కార్యాలయ భవనం వద్దకు చేరుకుంటారు.
- 11.40 గంటల వరకు మున్సిపల్ కార్యాలయ భవన ప్రారంభోత్సవం, పులివెందుల కౌన్సిలర్లతో సమావేశమవుతారు.
- 11.45 గంటలకు రాణితోపు చేరుకుంటారు.
- 12.10 గంటల వరకు పులివెందుల సిటీ ఫారెస్టు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- 12.15 గంటలకు గరండాల రివర్ ఫ్రంట్‌కు చేరుకుని గరండాల కెనాల్ డెవలప్‌మెంట్ మొదటి దశ పనులను ప్రారంభిస్తారు.
- 12.50 నుంచి 1.15 గంటల వరకు వైఎస్సార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.
- 1.25 గంటలకు న్యూటెక్ బయోసైన్స్, ఏపీ కార్ల్‌లో ప్రారంభోత్సవాల్లో గడుపుతారు.
- 1.50 గంటలకు ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 2.20 గంటల వరకు రిజర్వు
- 2.30 గంటలకు వైఎస్సార్ స్పోర్ట్స్ అకాడమి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.
- 3.10 గంటలకు భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 3.15 గంటలకు బయలుదేరి 3.35 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 3.35 నుంచి 4.05 గంటల వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు.
- 4.10కి హెచ్‌సీఎం రెసిడెన్స్‌కు చేరుకుంటారు.

10వ తేదీ..
- ఉదయం 8.50 గంటలకు హెచ్‌సీఎం రెసిడెన్స్ నుంచి బయలుదేరి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 9.20 గంటలకు కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 9.25 నుంచి 10.00 గంటల వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు.
- 10.00 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 10.10 గంటలకు రాజీవ్ మార్గ్ చేరుకుంటారు.
- 10.20 గంటల వరకు రాజీవ్ మార్గ్ రోడ్డు ప్రారంభోత్సవంలో గడుపుతారు.
- 10.25కు రాజీవ్ పార్కు చేరుకుంటారు.
- 10.35 గంటల వరకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేస్తారు.
- 10.50 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 11.00 గంటలకు కొప్పర్తి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11.10 గంటలకు అల్ డిక్సన్ యూనిట్‌కు చేరుకుని ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- 11.35 నుంచి 11.45 గంటల వరకు పారిశ్రామిక యూనిట్ల శంకుస్థాపన కార్యక్రమాల్లో గడుపుతారు.
- 11.55 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 12.10 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 12.15 గంటలకు విమానాశ్రయం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.00 గంటకు గన్నవరం విమానాశ్రయానికి వెళతారు
- 1.30 గంటలకు సీఎం నివాసానికి వెళతారు.

శివశ్రుతి.. విద్యార్థులకు స్ఫూర్తి

'నా విద్యా జీవితం ముగిసింది. నేను ఇక చదువుకు దూరమైనట్లే. నాకు చదువుకునే యోగం, అదృష్టం లేదు' అని వేదనకు గురైన పదేళ్ల చిన్నారికి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ) కొత్త జీవితాన్ని ప్రసాదించింది. నాడు అక్కడ పడిన విద్యాబీజం ఇంతింతై మహా వృక్షమై నేడు అదే పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా పనిచేసే భాగ్యాన్ని కల్పించింది. నేటితరం విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిన శివశ్రుతి విజయగాథపై ప్రత్యేక కథనం..



కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా అధికారుల నుంచి నియామకపత్రాన్ని అందుకుంటున్న శివశ్రుతి(ఫైల్)



కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శివశ్రుతి(ఫైల్)

- ఆర్థిక ఇబ్బందులతో అర్ధంతరంగా ఆగిన చదువు
- వెన్నుతట్టి విద్యా వెలుగులు ప్రసాదించిన కేజీబీవీ
- అంచెలంచెలుగా ఎదిగి నేడు అదే పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా ఎంపికైన శివశ్రుతి



కడప ఎడ్యుకేషన్: శివశ్రుతి తండ్రి శ్రీనివాసులు కారు డ్రైవర్, తల్లి రాజేశ్వరి గృహిణి. ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఆమె తమ సొంత ఊరు ఖాజీపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివింది. ఆ సమయంలో తండ్రి జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లాడు. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా పెద్దగా సంపాదన లేక తిరిగి సొంత ఊరికి వచ్చాడు. ఇక్కడా ఉండలేక కుటుంబంతో సహా తిరుపతికి వలస వెళ్లాడు. అక్కడ కారు డ్రైవర్‌గా ఉంటూ పిల్లలిద్దరిని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించాడు. చివరకు పిల్లలకు స్కూల్ ఫీజులు కూడా కట్టలేని స్థితిలో చేసేది లేక పిల్లల చదువులను అర్ధంతరంగా మాన్పించి తమ అత్త గారి ఊరైన చక్రాయపేటకు సంసారాన్ని మార్చాడు. దీంతో 6వ తరగతి చదువుతున్న శివశ్రుతి చదువు ఆగిపోయింది. ఏడాదంతా ఆమె ఇంట్లోనే ఉండిపోయింది. తరువాత సంవత్సరం డ్రాపౌట్ కింద పక్కింటి ఉపాధ్యాయులు ఇచ్చిన సలహాతో చక్రాయపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 7వ తరగతిలో చేరింది. ఇక వెనుతిరిగి చూడకుండా పీజీ వరకు తన చదువును నిర్విఘ్నంగా కొనసాగించింది. ఏ పాఠశాల అయితే తన జీవితానికి ఓ వెలుగుదారి చూపిందో అదే పాఠశాలకు నేడు శ్రుతి ప్రిన్సిపాల్‌గా ఎంపికై పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

కేజీబీవీ నుంచి పీజీ వరకు...

ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రైవేటు పాఠశాలలో చదివిన శివశ్రుతి 7వ తరగతి తరువాత తన చదువంతా కేజీబీవీలోనే ఉచితంగా కొనసాగించింది. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించింది. దీంతో కడప రత్నాల కింద ఎంపికై కడపలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ విద్యను ఉచితంగా చదువుకుంది. ఇంటర్‌లో 75 శాతం మార్కులను సాధించడంతో కడపలోని కోటిరెడ్డి మహిళా కళాశాలలో సీటు సంపాదించుకుని స్కాలర్‌షిప్‌తో డిగ్రీ చదివింది. తరువాత పీజీని కడపలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో పూర్తి చేసింది. అనంతరం బీఈడీ కూడా పూర్తి చేసింది.

2021లో ఉద్యోగంలోకి ..

పీజీ పూర్తి చేసిన శివశ్రుతి 2021లో ఓబులవారిపల్లె కేజీబీవీలో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్(సీఆర్‌టీ)గా చేరింది. అక్కడ ఆరు నెలలు పనిచేశాక టెట్ క్వాలిఫై కావాలనడంతో ఉద్యోగాన్ని మాని టెట్ పరీక్ష రాసి క్వాలిఫై అయింది.

విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకే..

ఏ పాఠశాలలో అయితే తన హైస్కూలు విద్యను ఉచితంగా పూర్తి చేసిందో అదే కేజీబీవీ పాఠశాలకు శివశ్రుతి నేడు ప్రిన్సిపాల్‌గా వెళ్లింది. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కేజీబీవీ పోస్టులకు ఆమె దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్ ఆధారంగా ఆమెను కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేశారు. సుండుపల్లి కేజీబీవీ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా మూడు రోజుల క్రితం విధుల్లో చేరారు.

కుటుంబానికి ఆసరాగా..

కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న శివశ్రుతి తండ్రి శ్రీనివాసులుకు పక్షవాతం సోకి మంచానికే పరిమితమయ్యారు. ఈ పరిస్థితిలో కుమారుడు కౌశిక్ష్ తన డిగ్రీ చదువును మానేసి తండ్రి బాటలోనే మరో కారుకు డ్రైవర్‌గా వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తూ వస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో శివశ్రుతికి ప్రిన్సిపాల్‌గా ఉద్యోగం రావడంతో ఆమె ఆ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది.

చాలా సంతోషంగా ఉంది..



నాకు కేజీబీవీలో ప్రిన్సిపాల్‌గా ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. ఎందుకుంటే అర్ధంతరంగా ఆగిన నా చదువుకు మళ్లీ జీవం పోసింది కేజీబీవీనే. ప్రస్తుతం అదే పాఠశాలకు ప్రిన్సిపాల్ కావడం అదృష్టం. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తా.

– శివశ్రుతి, కేజీబీవీ ప్రిన్సిపాల్, సుండుపల్లి

వైభవంగా పార్వేట ఉత్సవం



బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఊరేగుతున్న సిద్దేశ్వర, చెన్నకేశవ స్వామివార్లు

రాజంపేట : తాళ్లపాక బ్రహ్మోత్సవాలో భాగంగా గురువారం పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలలో కామాక్షి సమేత శ్రీ సిద్దేశ్వరస్వామికి పల్లకీసేవను నిర్వహించారు. అలాగే శ్రీ చెన్నకేశవస్వామి అశ్వవాహనంపై ఊరేగారు. భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. పార్వేటి ఉత్సవం సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు నిర్వహించిన కోలాటం భక్తులకు కట్టిపడేసింది. కార్యక్రమంలో సర్పంచ్ గౌరీశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ, గురుమూర్తియాదవ్, ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై టమాటా విక్రయాలు

మార్కెటింగ్ జేడీ రామాంజనేయులు



టమాటా మార్కెట్లో తనిఖీలు నిర్వహిస్తున్న జేడీ రామాంజనేయులు, ఏడీ తదితరులు

మదనపల్లె : టమాటా ధరల పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రాష్ట్రప్రజలకు ఉపశమనం కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్లలో రాయితీధరపై టమాటా విక్రయాలు జరుపుతోందని జేడీ రామాంజనేయులు తెలిపారు. గురువారం మదనపల్లె టమాటా మార్కెట్‌కు వచ్చిన ఆయన ఏడీ త్యాగరాజుతో కలిసి మండీల వద్ద వేలంపాటలను పరిశీలించారు. టమాటాలు తీసుకువచ్చిన రైతులతో మాట్లాడారు. మార్కెట్‌యార్డులో కల్పించాల్సిన వసతులు, అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌కమిటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో మదనపల్లె టమాటా మార్కెట్‌యార్డులో జూన్ 28 నుంచి ఇప్పటివరకు రైతుల నుంచి కిలో రూ.80 నుంచి 110 వరకు టమాటాను కొనుగోలు చేశామన్నారు. వాటిని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, గూడూరు రైతుబజార్లకు తరలించి కిలో రూ.50 చొప్పున వినియోగదారులకు విక్రయిస్తున్నామన్నారు. గురువారం 20 టన్నుల టమాటాలు కొనుగోలుచేసి విజయవాడకు 10, గుంటూరుకు 5, విశాఖపట్నంకు 5 టన్నులు రైతుబజార్లకు పంపామన్నారు. డిమాండ్, అవసరానికి అనుగుణంగా మరింత సరుకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో సెక్రటరీ అభిలాష్, మార్కెటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణ హత్య



హత్యకు గురైన వృద్ధురాలు షేక్ చాన్ ప్యారీ



జాగిలంతో సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, పోలీసులు

ఓబులవారిపల్లె : మండలంలోని చిన్నఓరంపాడు దిగువపల్లి గ్రామంలో గురువారం తెల్లవారుజామున షేక్ చాన్‌ప్యారీ (75) అనే వృద్ధురాలు దారుణహత్యకు గురైంది. పోలీసుల కథనం మేరకు.. చిన్నఓరంపాడు గ్రామానికి చెందిన షేక్ చాన్ ప్యారీ ఒంటరిగా జీవిస్తోంది. భర్త షేక్ మస్తాన్ గతేడాది మృతి చెందాడు. పిల్లలు లేకపోవడంతో షేక్ కరిముల్లాను చిన్నతనంలోనే దత్తత తీసుకుని పెంచుకున్నారు. దత్తపుత్రుడు, కోడలు గ్రామంలోనే మరోచోట అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు.

తలకు తీవ్ర గాయాలై..

చాన్‌ప్యారీ తలకు తీవ్ర గాయాలై ఇంట్లో రక్తపు మడుగులో పడి ఉన్న విషయాన్ని గమనించిన స్థానికులు విషయాన్ని పోలీసులకు చేరవేశారు. ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్ కమల్, డీఎస్పీ చైతన్య, ఇన్‌చార్జ్ సీఐ నరసింహారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి గ్రామస్తులను విచారించారు. కాగా బుధవారం దత్తపుత్రుడు కరీముల్లా తల్లి చాన్ ప్యారీతో కలిసి భోజనం చేసినట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్యకేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మృతురాలి ఒంటిపై బంగారం, ఇంట్లో నగదు అలాగే ఉంది. మృతురాలికి ఎవరితో శత్రుత్వం, గొడవలు లేకపోవడంతో ఆమె దత్తపుత్రుడు షేక్ కరిముల్లాపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నాని పోలీసులు తెలిపారు.

యువకుడి మృతి

రైల్వేకోడూరు అర్బన్ : కడప-తిరుపతి ప్రధాన రహదారిలోని నల్లరాళ్లమిట్ట సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో జానీతప మగర్ (20) అనే యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెలితే నేపాల్‌కు చెందిన జానీతప మగర్ అనంతరాజుపేట వద్ద ఉన్న ఓ రెస్టారెంట్‌లో పని చేస్తున్నాడు. గురువారం ద్విచక్రవాహనంపై వెళ్తూ అదుపు తప్పి కిందపడ్డాడు. కేసు విచారిస్తున్నామని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

మెరుగైన జీవనానికి వైకల్యం అడ్డంకి కాదు

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు అందిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి : శారీరక వైకల్యం అనేది మెరుగైన జీవనానికి అడ్డంకి కాదని, వారికి మరింత తోడ్పాటునందిస్తే ఏదైనా సాధించగలరని.. ఆ ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు చేయూతనిస్తోందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలోని ప్రైవేటు కళ్యాణ మండపంలో కాలేశ్వరీ ఫౌండేషన్, ఫ్రీడమ్ ట్రస్టు చెన్నై వారి సౌజన్యంతో నిర్వహించిన కృత్రిమ అవయవాల అమరిక కార్యక్రమానికి జేసి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అన్ని వర్గాల ప్రజల కష్టాలు, కన్నీళ్లగా దగ్గర చూసిన ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చి నాటి నుంచి వారి కష్టాలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. దివ్యాంగులకు సైతం నేనున్నానంటూ భరోసా ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. దివ్యాంగుల ఉపాధికి అవసరమైన ఉపకరణాలు మొదలుగు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధంగా వారికి ల్యాప్ ట్యాబ్‌ల, స్మార్ట్ ఫోన్‌లు వంటివి కూడా అందజేస్తూ మరింతగా ప్రోత్సహిస్తున్నారని వాటిని అర్హత కల్గిన వారంతా సద్వినియోగం చేసుకోవాలని జేసీ సూచించారు. జూన్ 2న కృత్రిమ అవయవాలను అమర్చుటకు 144 మంది శారీరక విభిన్న ప్రతిభావంతులకు కొలతలు తీసుకోవడం జరిగిందని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు సంక్షేమశాఖ అధికారి ఆర్‌వి కృష్ణ కిషోర్ అన్నారు. వారందరికీ గురువారం కృత్రిమ అవయవాల అమరిక కార్యక్రమం విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. కాలేశ్వరీ ఫౌండేషన్, ఫ్రీడమ్ ట్రస్టు, చెన్నై వారి సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో దివ్యాంగులకు అందిస్తున్న సహకారాన్ని మరువలేమని పలువురు దివ్యాంగులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఖైదీలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ఎస్‌సీ కృష్ణ



ఖైదీలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.ఎస్‌సీ కృష్ణ

రాజంపేట : ఖైదీలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.ఎస్‌సీ కృష్ణ అన్నారు. గురువారం రాజంపేట సబ్‌జైల్లోని ఖైదీలకు టీబీ, హెచ్ఐవీ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలులో ఉన్న ఖైదీలు ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రంగా ఉంటూ, మానసిక ప్రశాంతత కలిగి ఉండటం వల్ల ఎటువంటి వ్యాధులు దరిచేరవన్నారు. జైలు సూపరింటెండెంట్ మల్‌రెడ్డి మాట్లాడుతూ ఖైదీలు ఎవరైనా అనారోగ్య పరిస్థితులు కలిగితే వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీహెచ్‌వోల సంఘం గౌరవ అధ్యక్షుడు పిల్లిపిచ్చయ్య, రాజంపేట ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సిద్దిరామయ్య, టీబీ సూపర్‌వైజర్ పీ.జయప్రకాశ్, ఐసీటీసీ కౌన్సిలర్ సుబ్బయ్య, శివరాం, ల్యాబ్ టెక్నీషియన్ చైతన్య, జగన్, జైలు సిబ్బంది ప్రసాద్, వెంకటరమణ, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖైదీలకు టీబీ, హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు.

టీబీ పరీక్షలు విస్తృతంగా జరపాలి

అడిషనల్ డీఎంహెచ్ఓ శైలజ



స్కానింగ్ సెంటర్లలో రిజిస్టర్‌లను తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ శైలజ

మదనపల్లె : టీబీ రహిత దేశం కోసం కిందిస్థాయి నుంచి క్షయ కేసులను గుర్తించాలని, ప్రతి లక్ష జనాభాకు 2,000 మంది అనుమానితులకు పరీక్షలు జరపాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ శైలజ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మదనపల్లెకు వచ్చిన అడిషనల్ డీఎంహెచ్ఓ పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను, అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశామన్నారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, స్కానింగ్ యంత్రాలు, రిజిస్టర్‌లను తనిఖీ చేసి సిబ్బందికి సలహాలు, సూచనలు అందించామన్నారు. అనంతరం రామారావుకాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఓపీకి వస్తున్న పేషంట్లలో క్షయలక్షణాలు కలిగిన వారిని గుర్తించి టెస్టింగ్‌ల సంఖ్య పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. దీనికోసం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం, ఎన్‌సీడీసీ సర్వేలను ఉపయోగించి సస్పెక్ట్‌ను గుర్తించి పరీక్షలు చేయాలన్నారు. తర్వాత జిల్లా ఆస్పత్రిలో జరుగుతున్న మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌ల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని టీబీ, లెప్రసీ, హెచ్ఐవీలకు సంబంధించి అవగాహన కల్పించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రిజిస్టర్‌లు మెయింటైన్ చేసి ఎప్పటికప్పుడు రికార్డులు అప్‌డేట్ చేసుకుని ఆన్‌లైన్‌లో నమోదుచేయాలన్నారు. డాక్టర్.అమరావతి, సాయితేజానాయక్, టీబీ సూపర్‌వైజర్ ఎస్.ప్రభాకర్, డీపీఎంఓలు వేణుగోపాల్, శ్రీనివాసులు, టీబీ విభాగం సిబ్బంది సుశీల, వనజకుమారి, తరుణ్, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లు, ల్యాబ్ టెక్నీషియన్‌లు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : పట్టణంలోని రాంనగర్‌కు చెందిన షేక్ బల్కిస్‌భాను ఫిర్యాదు మేరకు రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లెకు చెందిన షేక్ బావాజీ, అతని కుటుంబసభ్యులపైన వరకట్న వేధింపుల కేసు నమోదుచేసినట్లు టూటౌన్ ఏఎస్ఐ రమణ తెలిపారు. షేక్ బల్కిస్‌భాను, బావాజీ భార్యాభర్తలు. కొంతకాలంగా భర్త బావాజీ, అతని కుటుంబసభ్యులు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడంతో పాటు, మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారని షేక్ బల్కిస్‌భాను గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో టూటౌన్ సీఐ మురళీకృష్ణ ఆదేశాల మేరకు బాధితురాలి భర్త షేక్ బావాజీతో పాటు అతడి కుటుంబసభ్యులైన షారియాజ్, షాహీదా, ఖాదర్‌బాషా, షిలార్‌షాలపై వరకట్న, వేధింపుల కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పాలెంపల్లె సుబ్బారెడ్డి అరెస్టు

కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ వెల్లడి

కడప అర్బన్ : కడప నగరంలోని సంధ్యా సర్కిల్ వద్ద జూన్ 23న ఉదయం చిన్న నాగిరెడ్డి గారి శ్రీనివాసుల రెడ్డి హత్య కేసులో ప్రధాన కుట్రదారుడైన పాలంపల్లి సుబ్బారెడ్డి అలియాస్ రాజు సుబ్బారెడ్డి (42)ని అరెస్టు చేసినట్లు కడప డీఎస్పీ ఎండి షరీఫ్ వెల్లడించారు. ఈనెల 5న బుధవారం సాయంత్రం ఇర్కాన్ సర్కిల్ వద్ద అరెస్టు చేసినట్లు వివరించారు. గురువారం సాయంత్రం డీఎస్పీ మీడియాతో మాట్లాడారు. గత నెల హత్యకు గురైన చిన్ననాగిరెడ్డిగారి శ్రీనివాసులరెడ్డి ప్రస్తుతం అరెస్టు చేసిన పాలంపల్లి సుబ్బారెడ్డి ఇద్దరూ 2020 సంవత్సరం వరకూ సన్నిహితంగా ఉంటూ కలిసి వ్యాపారాలు చేసుకునేవారు. అనంతరం ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. పరస్పర దాడులు చేసుకునే స్థితికి వెళ్లారు. ఈ పరిస్థితుల్లో శ్రీనివాసులరెడ్డికి సన్నిహితులుగా ఉన్న ప్రతాప్‌రెడ్డి, ల్యాబ్ శ్రీనివాసులు సైతం విడిపోయారు.దీంతో శ్రీనివాసులరెడ్డిని హత్య చేసేందుకు ల్యాబ్ శ్రీను సుబ్బారెడ్డితో చర్చలు నిర్వహించారు. హత్య చేసేందుకు నిందితులకు సుబ్బారెడ్డి ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు రూ. 30 లక్షలు డబ్బులు ఇవ్వడంతో పాటు కోర్టు వ్యవహారాలు చూసుకుంటానని భరోసా ఇచ్చాడు. హత్య కేసులో ఇదివరకే అరెస్టు అయిన ఏ3 నిందితుడు మేరువ శ్రీనివాసులు అలియాస్ ల్యాబ్ శ్రీను హత్యకు కొన్ని రోజుల ముందు సుబ్బారెడ్డి ఇంటిలో కూర్చుని హత్యకు కుట్ర చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. హత్య చేసిన తర్వాత ఏ3 అయిన ల్యాబ్ శ్రీను పాలెంపల్లి సుబ్బారెడ్డికి 'హత్య చేశాం..అతను చనిపోయాడు..'అంటూ ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. గూగుల్ టేక్ అవుట్ ద్వారా సాంకేతిక ఆధారాలను పరిశీలించి చూడగా సుబ్బారెడ్డి ప్రమేయం స్పష్టమైందని డీఎస్పీ తెలిపారు. నిందితుడు సుబ్బారెడ్డి తన సెల్ ఫోన్‌లోని వాట్సాప్ మెసేజ్‌లను డిలీట్ చేసారు. వాటిని రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని డీఎస్పీ వివరించారు.

కడప వేదికగా మరో క్రికెట్ టోర్నీ

నేటి నుంచి అండర్-19 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం

కడప స్పోర్ట్స్ : కడప నగరం వేదికగా మరో క్రికెట్ టోర్నీ ప్రారంభం కానుంది. ఈనెల 7 నుంచి 25వ తేదీ వరకు ఏసీఏ-సౌత్‌జోన్ అండర్-19 పురుషుల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మ్యాచ్‌లలో కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు జట్లు తలపడనున్నాయి. కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం/కేఓఆర్ఎం మైదానాల్లో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. మ్యాచ్‌ల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు.

మ్యాచ్‌ల షెడ్యూల్ .. 7 నుంచి 9వ తేదీ వరకు కేఎస్ఆర్ఎం మైదానంలో కడప, అనంతపురం జట్లు తలపడనున్నాయి. ఇదే తేదీల్లో వైఎస్ రాజారెడ్డి ఏసీఏ మైదానంలో కర్నూలు, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. 11 నుంచి 13 వరకు కేఎస్ఆర్ఎంలో అనంతపురం, చిత్తూరు, వైఎస్ఆర్ఆర్ ఏసీఏ మైదానంలో కడప, నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగుతాయి. ఇక 15 నుంచి 17వరకు కర్నూలు, నెల్లూరు జట్లు కేఎస్ఆర్ఎంలో, కడప చిత్తూరు జట్లు వైఎస్ఆర్ఆర్ ఏసీఏ మైదానాల్లో తలపడతాయి. 19 నుంచి 21 తేదీల్లో కేఎస్ఆర్ఎం మైదానంలో చిత్తూరు, నెల్లూరు జట్లు, వైఎస్ఆర్ఆర్ ఏసీఏ మైదానంలో అనంతపురం, కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. 23 నుంచి 25 వరకు కడప, కర్నూలు జట్లు కేఎస్ఆర్ఎంలో మైదానంలో, అనంతపురం, నెల్లూరు జట్లు వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో తలపడనున్నాయి.

రోడ్డు ప్రమాదంలో క్రేన్ ఆపరేటర్ మృతి

కురబలకోట : మండలంలోని కోనంగివారిపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్రేన్ ఆపరేటర్ గణేష్(45)మృతిచెందాడు. ముదివేడు ఎస్ఐ ముబీన్ తాజ్ కథనం మేరకు.. గుర్రం కొండ మండలం తరిగొండ దగ్గర అరిగిలవారిపల్లెకు చెందిన గణేష్ విద్యుత్ స్తంభాలు నాటే క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం పుంగనూరుకు పనికి వెళ్లడానికి స్వగ్రామం నుంచి బైక్‌పై బయలు దేరాడు. కురబలకోట మండలం కోనంగివారిపల్లె వద్ద అదుపు తప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టు మార్టం నిర్వహించారు. ఇతనికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని...



గణేష్ మృతదేహం

మదనపల్లె : గుర్తుతెలియని వాహనం ఢీకొని రైతు మృతి చెందిన సంఘటన కురబలకోట మండలంలో గురువారం మధ్యాహ్నం జరిగింది. గుర్రంకొండ మండలానికి చెందిన వెంకటరమణ కుమారుడు గణేష్(38) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం తన ద్విచక్రవాహనంలో ముదివేడు నుంచి పెద్దపల్లె మీదుగా మదనపల్లెకు బయలుదేరాడు. పెద్దపల్లె సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో గణేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముదివేడు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గణేష్‌కు భార్య అలివేలమ్మ, కుమార్తెలు లిఖిత, కీర్తన ఉన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కంచె తొలగింపు



ఆక్రమిత భూమికి వేసిన కంచెను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సిద్దవటం : మండలంలోని శాఖరాజు పల్లెలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఆక్రమించి ప్రభుత్వ భూమికి వేసిన కంచెను గురువారం ఆర్ఐ అనూరాధ, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు తొలగించారు. సిద్దవటం మండం లోని శాఖరాజుపల్లెలో సర్వేనెబంర్ 454, 455, 500 ల్లో ఉన్న దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఆక్రమించారు. ఈ విషయం కడప ఆర్డీఓ ధర్మ చంద్రారెడ్డి దృష్టికి వెల్లడంతో ఆయన తక్షణమే ఆక్రమించిన ప్రభుత్వ భూమికి వేసిన కంచను తొలగించాలని తహసీల్దారు లక్ష్మీదేవికి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో గురువారం వీఆర్‌వోలు, వీఆర్ఏలు కంచెను తొలగించారు.